ప్రజాతీర్పు 2024

మొదటి విడత ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లు

పురుషులు	8.4 కోట్లు
స్త్రీలు	8.23 కోట్లు
మూడో జెండర్	11,371

తొలిసారిగా నమోదైన ఓటర్లు **35.67 లక్షలు**

20-29 ఏండ్ల ఓటర్లు **3.51 కోట్లు**

85 ఏండ్లు పైబడిన వారు **14.14 లక్షలు**

దివ్యాంగ ఓటర్లు **13.89 లక్షలు**

పోటీలో ఉన్న అభ్యర్థులు **1625** (పురుషులు 1491, స్త్రీలు 134)

మొత్తం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	4627
స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ టీమ్‌లు	5208
వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు	2028

వీడియో వ్యూయింగ్ టీమ్‌లు 1225

కేజ్రీవాల్ హత్యకు జైల్లో కుట్ర!

- ఆయన్ను హతమార్చేందుకు మోదీ, బీజేపీ యత్నం
- ఇంటి భోజనాన్ని అడ్డుకొనే కుట్రలు ఇందుకోసమే
- ఆమ్ ఆద్మీ పార్టీ మంత్రి ఆతిశీ సంచలన ఆరోపణలు
- షుగర్ లెవల్స్ పెరిగినా ఇన్సులిన్ ఇవ్వనివ్వట్లేదని ఫైర్
- కేజ్రీ కావాలనే స్వీట్లు తింటున్నారు: కోర్టులో ఈడీ
- ఈడీ అధికారులు చెప్పేవన్నీ అబద్ధాలేనని ఆప్ ధ్వజం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): మద్యం పాలసీ కేసులో అరెస్టయి తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హత్యకు పెద్ద కుట్ర జరుగుతున్నదని ఆ పార్టీ నేత, ఢిల్లీ మంత్రి ఆతిశీ సంచలన ఆరోపణలు చేశారు. ఇందులో భాగంగానే ఇంటి భోజనాన్ని ఆయనకు ఇవ్వనీయకుండా అడ్డుకొనే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్టు ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ ఈ కుట్రలకు తెగబడుతున్నారని మండిపడ్డారు. మధుమేహంతో బాధపడుతున్న కేజ్రీవాల్‌కు చక్కెర స్థాయిలు పెరిగాయన్న ఆతిశీ.. ఇన్సులిన్ ఇచ్చేందుకు కూడా తీహార్ జైలు అధికారులు అనుమతినివ్వట్లేదని ఆరోపించారు. ఈడీ కోర్టులో చెప్తున్నదంతా అబద్ధమేనని ఆమె ధ్వజమెత్తారు.

అసలేం జరిగిందంటే?
మధుమేహంతో బాధ పడుతున్న కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ లెవెల్ ఏప్రిల్ 14 నాటికి 276 ఎంజీ/డీఎల్‌గా నమోదైంది. దీంతో వైద్యుడిని కలిసేందుకు అనుమతించాల్సిందిగా కేజ్రీవాల్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం కోర్టు విచారణ జరిపింది. అయితే, ఈ పిటిషన్‌ను వ్యతిరేకించిన ఈడీ.. విచారణ సందర్భంగా కేజ్రీవాల్‌పై పలు ఆరోపణలు చేసింది. 'ఇంటి భోజనానికి కేజ్రీవాల్‌కు అనుమతి ఉన్నది. దీంతో ఇష్టమైన ఆహారం తినేసి.. తద్వారా షుగర్ లెవెల్స్ పెంచుకొని, ఆరోగ్యపరమైన కారణాలతో బెయిల్ పొందాలని కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారు' అని ఈడీ మండిపడింది. ఈడీ ఆరోపణలను కేజ్రీవాల్ న్యాయవాది తిప్పికొట్టారు. మీడియా ప్రచారం కోసం ఈడీ ఇలాంటి స్టేట్‌మెంట్లు ఇస్తున్నదని మండిపడ్డారు. దీంతో కేజ్రీవాల్ తీసుకోవాల్సిన డైట్ వివరాలు ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాదిని, జైలులో ఇస్తున్న ఆహార వివరాలు అందించాలని తీహార్ జైలు అధికారులను కోర్టు ఆదేశించింది.

కృత్రిమ చక్కెరను వాడుతున్నారు
ఈడీ చేసిన ఆరోపణలను ఆప్ నేతలు ఖండించారు. 'మధుమేహ రోగులకు సిఫారసు చేసే కృత్రిమ చక్కెరను మాత్రమే కేజ్రీవాల్ వాడుతున్నారు. మధుమేహ రోగులకు షుగర్ స్థాయిలు ఎప్పుడైనా పడిపోవచ్చు. అందుకే అరటిపండ్లు, చాక్లెట్ల వంటివి దగ్గర పెట్టుకోవాలని వైద్యులే సలహా ఇస్తారు. దాన్ని కూడా ఈడీ తప్పుగా చిత్రీకరించి అసత్యాలు వల్లెవేస్తున్నది' అంటూ ఆతిశీ మండిపడ్డారు.

సమరానికి నేడే ఆరంభం

- సార్వత్రిక ఎన్నికల తొలి దశ పోలింగ్‌కు సర్వం సిద్ధం
- అత్యధిక స్థానాలకు ఈ దశలోనే ఓటింగ్ పూర్తి
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అన్ని రాజకీయ పార్టీలు
- బరిలో పలువురు కేంద్రమంత్రులు, కీలక నేతలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): ఓట్ల పండుగ జరుపుకునేందుకు దేశం సిద్ధమైంది. ఏడు విడతల్లో జరిగే సార్వత్రిక లోక్‌సభ ఎన్నికల మొదటి దశ పోలింగ్ ఈ నెల 19న(శుక్రవారం) జరగనుంది. తొలి దశ ఎన్నికల సమరంలో ఒకరినొకరు ఢీకొనేందుకు అధికార, విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ విడతలో 102 లోక్‌సభ నియోజక వర్గాల్లో జరిగే ఎన్నికల్లో 16.63 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీని కోసం 1.87 లక్షల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 18 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. తొలి విడత లోక్‌సభ ఎన్నికలతో పాటు రెండు రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా శుక్రవారం జరగనున్నాయి. ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచారు.

జమ్ముకశ్మీర్ దోడాలో ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని కొండపైకి తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

సర్వ శక్తులూ ఒడ్డుతున్న ఎన్డీఏ, ఇండియా కూటములు
మొదటి దశలో మిగతా దశల కన్నా ఎక్కువ స్థానాల్లో ఎన్నికలు జరుగుతుండటం అన్ని పార్టీలకు ఈ ఎన్నికలు ప్రధానంగా మారాయి. మొదటి విడతలో ఆధిక్యం చూపితే అది మిగతా దశల్లో కూడా ఆ ఆధిక్యం కొనసాగుతుందని పార్టీలు ఆశిస్తున్నాయి. మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకోవడానికి బీజేపీ, దాని మిత్రపక్షాలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఇంతవరకు సొంతంగా విజయం రుచి చూడని తమిళనాడులో, తొలిసారిగా కేరళలో విజయం సాధించాలని కమలం పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. ఇతర పార్టీలు సైతం ఎన్నికల్లో గెలుపుపై గట్టి ఆశలే పెట్టుకున్నాయి. మోదీ ప్రజా వ్యతిరేక, మత విద్వేష చర్యలు తమను గెలిపిస్తాయని, బీజేపీ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని, ఆ పార్టీపై వ్యతిరేకత తమకు బాగా లాభించి అధికారాన్ని తెచ్చిపెడుతుందని వారు ఆశపడుతున్నారు.

బస్తర్‌లో భారీ భద్రత
ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రాబల్యంగల బస్తర్ లోక్‌సభ నియోజకవర్గంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ నేడు పోలింగ్ జరగబోతున్నది.ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టులు పిలుపునివ్వడంతో భద్రతా దళాలకు ఎన్నికల నిర్వహణ సవాలుగా మారింది.

ఎన్నికలు జరిగే రాష్ట్రాలు
మొదటి విడతలో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, త్రిపుర, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, అండమాన్ నికోబార్ దీవులతో సహ కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూ కశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరి లలో ఎన్నికలు జరుగనున్నాయి.

గెలిచి నిలుస్తారా?
మొదటి విడత ఎన్నికల బరిలో పలువురు ప్రముఖులు ఉన్నారు. వారిలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి బరిలో ఉన్నారు. మరో ప్రముఖుడు జితిన్ ప్రసాద్ యూపీలోని పిలిభిత్ లోకసభ నియోజక వర్గం నుంచి, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళి సై తమిళనాడులోని చెన్నై సౌత్ నుంచి బీజేపీ అభ్యర్థిగా, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం తన తండ్రి ఏడుసార్లు నెగ్గిన శివగంగ లోక్‌సభలో పోటీ చేస్తున్నారు. ఇక బీజేపీ తమిళనాడు అధ్యక్షుడైన కే అన్నామలై కోయంబత్తూరు నుంచి, డీఎంకే ఎంపీ దయానిధి మారన్ చెన్నై సెంట్రల్ నుంచి, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్ తిరిగి చింద్వాడా నుండి కాంగ్రెస్ తరపున, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్పూర్ నుంచి ఇమ్రాన్ మసూద్ పోటీలో ఉన్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మాంఝీ ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బీహార్‌లోని గయా స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నేతగా ఉన్న గౌరవ్ గొగోయ్, అస్సాంలోని జోర్హాట్ నుంచి ఈసారి కూడా పోటీ పడుతున్నారు.

ఓటరు వేసవి తాపాన్ని జయిస్తాడు: సీఈసీ
భారత దేశ ప్రజాస్వామ్య మహత్తర భావ వ్యక్తీకరణ ఎన్నికల ద్వారా జరుగుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ గురువారం ఓ వీడియో సందేశంలో చెప్పారు. ఓటు వేయడం వంటి ఉత్తమమైన మార్గం మరొకటి ఏదీ లేదన్నారు. వేసవి కాలంలో సూర్య ప్రతాపం నుంచి కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఓటర్లను కోరారు. అయితే భారతీయ ఓటరు వేసవి తాపాన్ని జయిస్తాడని, ఓటరుకుగల చైతన్యం, స్ఫూర్తి తనకు తెలుసునని వ్యాఖ్యానించారు.

నాలుగో విడతకు నోటిఫికేషన్ విడుదల

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరగనున్న నాలుగో విడత ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విడతలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌తోపాటు కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లోని 96 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. గురువారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మే 13న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడిస్తారు.

'కాషాయం'లోకి మారిన డీడీ న్యూస్ చిహ్నం

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వ జాతీయ టెలివిజన్ ఛానల్ దూరదర్శన్ కేంద్ర ప్రభుత్వం పట్ల స్వామి భక్తిని ప్రదర్శించింది. వార్తలను ప్రసారం చేసే దూరదర్శన్ న్యూస్ ఛానల్ లోగో రంగును కాషాయ రంగులోకి మార్చేసి తన విధేయతను ప్రదర్శించుకుంది. లోగోతో పాటు న్యూస్ అనే అక్షరాలను కూడా కాషాయ రంగులోకి మార్చడం పట్ల అధికార బీజేపీపై పెద్దయెత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'ఎంతో చరిత్ర ఉన్న డీడీ న్యూస్ లోగో కాషాయరంగులోకి మారిపోయింది. ఇది ప్రసార భారతి కాదు ప్రచార భారతి' అని గతంలో దూరదర్శన్ సీఈవోగా పనిచేసిన టీఎంసీ ఎంపీ జవహర్ సర్కార్ విమర్శించారు. దూరదర్శన్ చర్య మత ఉద్రిక్తతలను పెంచుతుందని కేరళ సీఎం పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు.

9 మంది నక్సల్స్ మృతదేహాలు గుర్తింపు

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 18 : ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల్లో మరో 9 మంది మృతదేహాలను గుర్తించినట్లు పోలీస్ అధికారులు గురువారం తెలిపారు. కాగా, ఇది నమ్మకద్రోహంతో చేసిన ఎన్‌కౌంటర్ అని మావోయిస్టులు ఆరోపించారు. ఈ మేరకు దండకారణ్యం క్రాంతికారి మహిళా సంఘటన్ ప్రతినిధి రామ్‌కో హిచామి పేరుతో లేఖ విడుదల చేశారు.

బంగారాన్ని చిమ్ముతున్న అగ్ని పర్వతం

రోజుకు 80 గ్రాముల చొప్పున గాలిలోకి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): అంటార్కిటికాలోని మౌంట్ ఎరేబస్ అనే అగ్ని పర్వతం ప్రతిరోజూ 80 గ్రాముల బంగారాన్ని చిమ్ముతున్నట్టు పరిశోధకులు తెలిపారు. కొన్ని వాయువులు, లావాతో కలిపి పుత్తడిని వెదజల్లుతున్నట్టు వెల్లడించారు. 1972 నుంచి ఇప్పటివరకూ ఈ అగ్నిపర్వతం నుంచి సుమారు 1518 కిలోల బంగారు రేణువులు ధూళి రూపంలో వాతావరణంలోకి చేరినట్టు పేర్కొన్నారు. అగ్ని పర్వతం కింద బంగారు గని ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

క్రూయిజ్ మిస్సైల్ పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) గురువారం నిర్వహించిన ఇండిజెనస్ టెక్నాలజీ క్రూయిజ్ మిస్సైల్ (ఐటీసీఎం) పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ఈ పరీక్షను నిర్వహించారు. స్వదేశీ పరిజ్ఞానంతో ఈ క్షిపణిని తయారు చేశారు. ఊహించినట్లుగానే ఇందులోని అన్ని ఉప వ్యవస్థలు సజావుగా పని చేశాయని కేంద్ర రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఓటరుకు వీవీప్యాట్ స్లిప్ ఇస్తే నష్టమేంటి?

ఈసీకి సుప్రీంకోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ: ఓటరు తాను వేసిన గుర్తుకే ఓటు పడిందో లేదో సరి చూసుకునేందుకు వీవీ ప్యాట్ స్లిప్‌లను కూడా పరిగణనలోకి తీసుకోవాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ఎన్నికల ప్రక్రియలో పవిత్రత ఉండాలని, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహించడానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. 'ఎన్నికల ప్రక్రియకు పవిత్రత ఉండాలి. ఒక వేళ ఓటరు వీవీ ప్యాట్ స్లిప్ కనుక పొందితే ఎన్నికల సంఘానికి ఏమన్నా నష్టం కలుగుతుందా? అని ప్రశ్నించింది.

తోషిబాలో 5 వేల ఉద్యోగులపై వేటు

అదే బాటలో గూగుల్

వాషింగ్టన్: ఖర్చుల భారం తగ్గించుకోవడం, రీస్ట్రక్చరింగ్... పేరు ఏదైనా ఫలితం ఒకటే... అదే ఉద్యోగులపై వేటు! ప్రపంచ ప్రసిద్ధి చెందిన గూగుల్, తోషిబా కంపెనీలు ఉద్యోగులను పెద్ద ఎత్తున తగ్గిస్తున్నాయి. రీస్ట్రక్చరింగ్ పేరుతో తోషిబా కార్పొరేషన్ చేపట్టిన చర్యల వల్ల దాదాపు 5 వేల మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. మరోవైపు గూగుల్ తాజాగా అమలు చేస్తున్న లే ఆఫ్‌ల వల్ల ఆ కంపెనీలోని రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్లలోని అనేక మంది ఉద్యోగులపై వేటు పడనున్నది.

యూపీ ఎన్నికల బరిలో తెలంగాణ మహిళ

జాన్‌పూర్ బీఎస్పీ అభ్యర్థిగా శ్రీ కళారెడ్డి
సూర్యాపేట జిల్లా రత్నవరం ఆమె స్వస్థలం

భర్త ధనంజయ్ సింగ్‌తో శ్రీకళారెడ్డి

లక్నో, ఏప్రిల్ 18: ఉత్తరప్రదేశ్‌లోని జాన్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి తెలంగాణ మహిళ శ్రీకళారెడ్డి పోటీ చేస్తున్నారు. బీఎస్పీ అభ్యర్థిగా ఆమె ఎన్నికల బరిలో నిలిచారు. ప్రస్తుతం ఆమె జాన్‌పూర్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కూడా కొనసాగుతున్నారు. 2009 ఎన్నికల్లో జాన్‌పూర్ నుంచి ఆమె భర్త ధనంజయ్ సింగ్ బీఎస్పీ తరపున ఎంపీగా గెలిచారు. ఈసారి కూడా ఆయన పోటీ చేయాలని అనుకున్నప్పటికీ కిడ్నాప్, దోపిడీ కేసులో ఆయన జైలుపాలయ్యారు. దీంతో శ్రీకళారెడ్డి ఎన్నికల బరిలో దిగారు. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన శ్రీకళారెడ్డిది రాజకీయ కుటుంబం. ఆమె తండ్రి కీసర జితేందర్ రెడ్డి 1972లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా పనిచేశారు.

త్రిముఖ పోటీ
జాన్‌పూర్‌లో ముందుగా బీజేపీ అభ్యర్థి కృపాశంకర్ సింగ్, సమాజ్‌వాదీ అభ్యర్థి బాబూసింగ్ కుశ్వాహ మధ్యనే పోటీ ఉంటుందని అనుకున్నా బీఎస్పీ తరపున శ్రీకళారెడ్డి కూడా బరిలోకి దిగడంతో త్రిముఖ పోరు నెలకొన్నది. కాగా, శ్రీకళారెడ్డి తన ఎన్నికల అఫిడవిట్‌లో భారీగా ఆస్తులను చూపించారు. తనకు రూ.6.71 కోట్ల చరాస్తులు, రూ.780 కోట్ల స్థిరాస్తులు, రూ.1.74 కోట్ల విలువైన ఆభరణాలు ఉన్నట్టు ఆమె ప్రకటించారు. ధనంజయ్ సింగ్‌కు రూ.5.31 కోట్ల స్థిరాస్తులు, రూ.3.56 కోట్ల చరాస్తులు ఉన్నట్టు పేర్కొన్నారు.

ఓట్ల కోసం నీళ్ల బేరమా?!

సోదరుడికి ఓటేస్తేనే నీళ్లిస్తామని డీకే బెదిరిస్తున్నారు: బీజేపీ
సమస్యలు పరిష్కరించడమే తమ కర్తవ్యమన్న శివకుమార్

బెంగళూరు: బెంగళూరు ప్రజలకు గొంతు ఎండిపోతున్న సమయంలో డిప్యూటీ సీఎం శివకుమార్ ఓట్ల కోసం బేరం పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయన సోదరుడు డీకే సురేశ్‌కు ఓటు వేస్తేనే కావేరీ జలాలను అందజేస్తామని ఓటర్లకు శివ కుమార్ చెప్పినట్లు బీజేపీ ఆరోపించింది. సురేశ్ బెంగళూరు గ్రామీణ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను షేర్ చేశారు. శివ కుమార్ తన సోదరుడు సురేశ్ పోటీ చేస్తున్న నియోజకవర్గంలోని ఓ హౌసింగ్ సొసైటీకి వెళ్లారని తెలిపారు. ''నేను బిజినెస్ డీల్ కోసం వచ్చాను. మీరు నా సోదరునికి ఓటు వేస్తే, మీకు కావేరీ నదీ జలాలు సరఫరా అయ్యేలా నేను చూస్తాను'' అని శివకుమార్ చెప్పినట్లు ఈ వీడియోలో ఉందన్నారు. ఓటర్లు ఎవరికి ఓటు వేస్తారనే దానితో సంబంధం లేకుండా, ప్రజలకు సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ఓ మంత్రిగా శివ కుమార్‌కు ఉందని మాలవీయ అన్నారు. అయితే శివ కుమార్ నిస్సిగ్గుగా తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఇటువంటి బెదిరింపులు, క్విడ్ ప్రో కో చర్యలు ఆమోదయోగ్యం కాదన్నారు. బీజేపీ ఆరోపణలపై శివకుమార్ గురువారం స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కావేరీ నదీ జలాలు బెంగళూరు ప్రజలకు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలను పరిష్కరించడమే తమ కర్తవ్యమని..దాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

బెంగాల్ గవర్నర్‌పై ఈసీకి ఫిర్యాదు

ఎన్నికల వేళ పర్యటనలేమిటని టీఎంసీ ఆగ్రహం

కోల్‌కతా, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారని అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) మండిపడింది. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో గవర్నర్ తరచూ జోక్యం చేసుకుంటున్నారని, దీనిని నిరోధించాలంటూ గురువారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ప్రచారం ముగిసి నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పర్యటించడానికి ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. మొదటి విడత ఎన్నికలకు ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, గవర్నర్ వెంటనే తన కూచ్ బెహార్ పర్యటనను రద్దు చేసుకునేలా ఆదేశించాలని టీఎంసీ కోరింది.

మా ఉత్పత్తుల్లో చక్కెరను 30 శాతం తగ్గించాం

బేబీ ఫుడ్స్‌పై 'నెస్లే ఇండియా' వివరణ

న్యూఢిల్లీ: భారత్ సహా కొన్ని పేద దేశాల్లో విక్రయిస్తున్న బేబీ ఫుడ్ ఉత్పత్తుల్లో అధిక చక్కెర వాడుతున్నారన్న ఆరోపణలపై 'నెస్లే ఇండియా' స్పందించింది. గత ఐదేండ్లుగా భారత్‌లో తాము విక్రయిస్తున్న చిన్న పిల్లల ఆహార ఉత్పత్తుల్లో చక్కెరను 30 శాతానికిపైగా తగ్గించామని ఆ కంపెనీ ప్రకటించింది. యూరప్ దేశాలతో పోల్చితే ఇండియాలో నెస్లే విక్రయిస్తున్న బేబీ ఫుడ్ ప్రొడక్ట్స్‌లో చక్కెర ఎక్కువ ఉందని స్విస్ ఎన్జీవో 'పబ్లిక్ ఐ' ఇటీవల ఓ నివేదికను విడుదల చేసింది. ఇండియాలో నెస్లే విక్రయిస్తున్న 15 రకాల సెరిలాక్ ఉత్పత్తుల్లో ఒక్కో సర్వ్‌లో 2.7 గ్రాముల చక్కెర ఉంటున్నదని తెలిపింది.

శిల్పాశెట్టి దంపతుల ఆస్తులు అటాచ్

క్రిప్టో స్కీమ్ కేసులో 98 కోట్ల విలువైనవి ఈడీ స్వాధీనం

ముంబై ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): నటి శిల్పాశెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రాకు చెందిన రూ.98 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం అటాచ్ చేసింది. క్రిప్టో అస్సెట్స్ పోంజీ స్కీమ్ కేసులో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణపై ముంబైలోని జుహూలో శిల్పాశెట్టి పేరుపై ఉన్న ఒక బంగ్లా, పుణెలోని ఒక ఫ్లాట్, కుంద్రా పేరుపై ఉన్న ఈక్విటీ షేర్లను స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది. వీటి మొత్తం విలువ రూ.97.79 కోట్లని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే రెండు చార్జిషీట్లు దాఖలు చేశామని, కేసులో నిందితులైన భరద్వాజ్, నితిన్ గౌర్, నిఖిల్ మహజన్‌లను అరెస్ట్ చేసి జైలుకు పంపామని, మరికొందరు పరారీలో ఉన్నారని ఈడీ అధికారులు తెలిపారు

ఝూఠా పత్ర్!

- బురిడీ హామీలతో బీజేపీ, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలు
- 14 హామీలతో బీజేపీ, 25 గ్యారెంటీలతో కాంగ్రెస్
- ఓట్లు రాబట్టేందుకు అబద్ధపు వాగ్దానాలతో ప్రచారం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): హ్యాట్రిక్ విజయం కోసం బీజేపీ 'సంకల్ప్ పత్ర' పేరుతో, ఈ సారైనా అధికారాన్ని చేపట్టాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ 'న్యాయ్ పత్ర' పేరిట ఎన్నికల మ్యానిఫెస్టోలను విడుదల చేశాయి. ఓటర్లను ఆకర్షించడానికి 14 ప్రధాన హామీలతో బీజేపీ రాగా, 25 గ్యారంటీలతో కాంగ్రెస్ పెద్ద లిస్టునే సిద్ధం చేసింది. అయితే, ఇరుపార్టీలు మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రధాంశాలు.. ఆయా పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు విస్మరించడం గమనార్హం. అధికారాన్ని చేపట్టడానికి ఇరు పార్టీలు అబద్ధపు హామీలతో ఓటర్లను బురిడీ కొట్టిస్తున్నాయని చర్చ జరుగుతున్నది.

బీజేపీ బూటకపు హామీలు ఇలా..
నిర్ణీత వ్యవధిలో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని మ్యానిఫెస్టోలో హామీనిచ్చారు. అయితే, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ హామీ పదేండ్లైనా నెరవేరలేదు. సీనియర్ సిటిజెన్లు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటామన్నారు. రైళ్లలో సీనియర్ సిటిజెన్లకు ఉండే రాయితీకి కోత పెట్టారు. మణిపూర్, యూపీ తదితర రాష్ట్రాల్లో మహిళలపై హింస పెరిగినా సర్కారు చూసీచూడనట్టు వ్యవహరించింది. పంటల మద్దతు ధర పెంచుతామన్నారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి రైతుల ఉసురు తీశారు. దేశ ఆర్థికవ్యవస్థను మూడో స్థానానికి చేరుస్తామన్నారు. అయితే, ధరల పెరుగుదల, నిరుద్యోగం గతంలో ఎన్నడూ చూడని స్థాయికి చేరింది. ఈ లెక్కన ఈ హామీ నెరవేరే అవకాశమేలేదు.

కాంగ్రెస్ కబుర్ల కాలక్షేపం అలా..
కేంద్రంలోని 30 లక్షల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అయితే, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో జరిగిన పేపర్ లీకులపై మాట్లాడట్లేదు. వ్యవసాయంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేస్తామంటున్నారు. హస్తంపార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పంట బీమాకు కూడా దిక్కులేదు. దేశంలోని ప్రతి పేదింటి మహిళకు ఏటా ఒక లక్ష రూపాయల సాయం అందిస్తామన్నారు. దేశంలోని 85 కోట్ల మందికి ఉచిత రేషన్ అందుతున్నది. అంటే ఈ లెక్కన 30 కోట్ల కుటుంబాలు పేదరికంలో ఉన్నట్టు భావించాలి. కాంగ్రెస్ హామీ ప్రకారం మొత్తం దేశ బడ్జెట్‌లో ఏటా రూ.30 లక్షల కోట్లను ఈ ఒక్క గ్యారెంటీ కోసమే పక్కనపెట్టాలి. ఇది సాధ్యంకాదు. వచ్చే పదేండ్లలో జీడీపీని డబుల్ చేస్తామన్నారు. ప్రస్తుత వృద్ధిరేటును పరిగణలోకి తీసుకొంటే ఇది సాధ్యం కాదు.

కృత్రిమ పద్ధతులు పర్యావరణానికి ముప్పు

దుబాయ్ వరదలపై పర్యావరణ వేత్తల ఆందోళన

దుబాయ్, ఏప్రిల్ 18: భారీ వర్షాలు, వరదలతో దుబాయ్ అతలాకుతలం కావడానికి వాతావరణ మార్పులే కారణమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులు ప్రపంచానికి పెనుముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని కృత్రిమ పద్ధతులతో ప్రభావితం చేయడం విపరిణామాలకే దారి తీస్తుందని హెచ్చరించారు. భూతాపం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని వివరించారు. దుబాయ్‌లో ఆకస్మిక వర్షానికి క్లౌడ్ సీడింగ్ కూడా కారణమై ఉంటుందనే వాదన వినిపిస్తున్నది. క్లౌడ్ సీడింగ్ అంటే కృత్రిమంగా వర్షాలు కురిపించేందుకు, వర్షపాతాన్ని పెంచేందుకు అవలంబించే పద్ధతి. వర్షాభావ పరిస్థితి, నీటి కొరత ఎక్కువగా ఉండే ఏడారి దేశమైన యూఏఈ చాలా ఏండ్లుగా క్లౌడ్ సీడింగ్‌తో కృత్రిమ వర్షాలు కురిపిస్తున్నది.

అత్యుత్తమ విమానాశ్రయంగా దోహా హమద్

వరల్డ్ బెస్ట్ ఎయిర్‌పోర్ట్స్ లిస్టులో ప్రథమ స్థానం
హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు 61వ ర్యాంక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ఖతార్ రాజధాని దోహాలోని 'హమద్' ఎయిర్‌పోర్ట్ 2024 సంవత్సరానికి గాను 'ప్రపంచ ఉత్తమ విమానాశ్రయం' కిరీటాన్ని కైవసం చేసుకుంది. సింగపూర్‌లోని చాంజీ ఎయిర్‌పోర్టు 2వ స్థానం సాధించింది. 'స్కైట్రాక్స్' ఏటా వరల్డ్ బెస్ట్ ఎయిర్‌పోర్ట్స్ జాబితాను విడుదల చేస్తుంది. టాప్-100లో భారత్ నుంచి హైదరాబాద్(61వ ర్యాంక్), ఢిల్లీ, బెంగళూరు, ముంబయి విమానాశ్రయాలకు స్థానం దక్కింది.